## క్లుప్తంగా

### కుమారస్వామికి విశేషపూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓ ఎస్.లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### అగ్నిప్రమాదాలపై అవగాహన


అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం అగ్నిమాపక అధికారులు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పెట్రోల్‌బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి అగ్ని ప్రదామాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అగ్నిమాపక అధికారి భీముడునాయక్ అగ్నిప్రమాదాలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అప్రమత్తంగా ఎలా వ్యవహించాలనేది వివరించారు. ర్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం


మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండలంలోని ముసలమడుగు గ్రామంలో పశుగ్రాసం దగ్ధమైంది. ముసలమడుగు గ్రామంలోని ముస్లిం కాలనీలో షఫీ ఉల్లా అనే వ్యక్తి పశువుల కోసం కల్లంలో గడ్డివామి ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పు పెట్టడంతో కాలిపోయింది. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. గ్రామస్తుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పీ వేశారు. పశుగ్రాసం కాలిబడిదవ్వడంతో సుమారు రూ.50 వేలవరకు రైతకు ఆస్తీ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ఎండ తీవ్రత భారీగా ఉన్నందున సోమవారం ఎదురుపాడు గ్రామంలో మంగళవారం ముసలమడుగు గ్రామంలో పశుగ్రాసాలు దగ్ధం కావడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

**విద్యుత్ తీగలు తగిలి..**

పగిడ్యాల: మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రిలో మంగళవారం విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతు ముచ్చుమర్రిలో ఎకరం వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. మార్గమధ్యంలో కొత్త ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మెయిన్ రోడ్డుపై విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డికి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా వరిగడ్డి ట్రాక్టర్‌ను మంటలు చుట్టుముట్టగా అప్రమత్తమైన డ్రైవర్ గ్రామ శివారుకు వెళ్లి ట్రాలీ లిఫ్ట్ ఎత్తి గడ్డిని రోడ్డుపై వదిలాడు. గమనించిన గ్రామస్తులు నీళ్ల బిందెలతో మంటలను ఆర్పి పెనుప్రమాదం చోటుచేసుకోకుండా నివారించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 25 వేల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

### జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకుడు ఎస్.రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఐసా మండల నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపుగా 19 గ్రామాల నుంచి విద్యార్థులు వందల సంఖ్యలో పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. తర్వాత ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించడానికి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు వర్ధన్,వంశీ, నాని,అమర్ పాల్గొన్నారు.

### 26 నుంచి ఆత్మకూరులో ‘గడప గడపకు ’

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 26 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్, మున్సిపల్ మేనేజర్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 26 నుంచి వివిధ వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ సుల్తాన్, వార్డు సభ్యులు బోయరాముడు, బోయ శంకర్, రంగస్వామి, రెహమాన్ పాల్గొన్నారు.

# కాలేయానికి ముప్పు

- పెరుగుతున్న ఫ్యాటీ లివర్, హెపటైటిస్ రోగుల సంఖ్య
- ఆల్కహాల్ సేవనంతో లివర్ సిరోసిస్
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక పరీక్షలు, మందులు
- హెపటైటిస్‌కు రూ.10 వేలు విలువ చేసే మందులు ఉచితం
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం

కర్నూలు(హాస్పిటల్): మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి. జీర్ణప్రక్రియలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆహారం సరిగా జీర్ణమయ్యేందుకు, పోషకాలు శరీరానికి అందించేందుకు, వ్యర్థాలు బయటకు పోయేందుకు కాలేయ పనితీరు చాలా ముఖ్యం. అయితే చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వారసత్వం తదితర కారణాల వల్ల కాలేయం చిక్కుల్లో పడుతోంది. కొన్నిసార్లు కాలేయ మార్పిడికి దారి తీస్తుంది. ఏటా ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీర్ణకోశ వ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజీ)కు 2022 లో 722, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో 126 మంది కాలేయ సమస్యలతో చికిత్స కోసం వచ్చారు. వీరిలో అక్యూట్ హెపటైటిస్ 48, ఆల్కహాల్ కేసులు 539, హెచ్‌బీవీ 121, హెచ్‌సీవీ 36, న్యాష్ 5, ఏఐహెచ్ 4, హెచ్‌సీసీ 19, ఇతర సమస్యలతో 179 మంది చికిత్స కోసం వచ్చారు. అధిక శాతం మంది ఆల్కహాలు సేవించడం, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్–బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా లివర్ దెబ్బతినడం వల్ల వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని రకాల జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా హెపటైటిస్–బి, సి వ్యాధులకు ఖరీదైన మందులను ఉచితంగా అందిస్తున్నారు.

**అవయవాల్లో కెల్లా కాలేయం భిన్నం**

మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంధి కాలేయం. ఇది జీవక్రియ, రోగనిరోధక శక్తి, జీర్ణక్రియ ప్రక్రియల్లో చురుగ్గా వ్యవహరిస్తుంది. కాలేయం పూర్తిగా దెబ్బ తినే వరకు ఎలాంటి సంకేతాలు కనిపించవు. అలా గని అశ్రద్ధ చేస్తే కచ్చితంగా ముప్పు తెచ్చుకున్నట్లే.

**కాలేయ వ్యాధి లక్షణాలు**

కాళ్ల,చీలమండలాల్లో వాపు,ఆకలిలేకపోవడం,వికారం,వాంతులు, జ్వరం,కామెర్లు,కడుపునొప్పి, మూత్రం రంగులో మార్పు,పొట్టుచుట్టూ దురద,ఎరుపు చ ర్మం ,మలంలో రక్తం తదితర లక్షణాలు కనిపిస్తే వైద్యులను కలిసి చికిత్సతీసుకోవాలి.రెండు అంతకంటే ఎక్కువ లక్షణాలు ఉంటే తక్షణ వైద్యసహాయం అవసరం.



**కాలేయ వ్యాధులు రాకుండా ఉండాలంటే...!**

- అతిగా మద్యం, మాంసం, కొవ్వు పదార్థాలు, వేపుళ్లు తీసుకోరాదు
- ఉప్పు, చక్కెర ఎక్కువ మోతాదులో తీసుకోవడం ప్రమాదకరం
- ప్రాసెస్ చేసిన పిండి, ధాన్యాలు తినవద్దు.

ఇలా చేయాలి...

- పచ్చని ఆకుకూరలు లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.
- సల్ఫర్ ఎక్కువగా ఉండే వెల్లుల్లి, పసుపు కాలేయానికి మేలు చేస్తాయి.
- గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు, ఆలివ్ ఆయిల్, వాల్‌నట్స్, అవకాడోలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయి.
- విటమిన్–సి పదార్థాలు కాలేయం వద్ద కొవ్వును నియంత్రిస్తాయి.
- నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీలివర్**



కాలేయం చుట్టూ కొవ్వు చేరడం వల్ల ఫ్యాటీలివర్ వస్తుంది. అధికంగా ఆల్కహాలు తీసుకోవడం, ఆహారపు అలవాట్ల కారణంగా వచ్చిన ఫ్యాటీలివర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం మరింత దెబ్బతినే అవకాశం ఉంటుంది. మద్యం తాగకపోయినా ఫ్యాటీలివర్ సమస్యలు వస్తుంటే నాన్ ఆల్కహాల్ ఫ్యాటీలివర్ డిసీజ్ అంటారు. హెపటైటిస్–బి, సి మందులతో నయం చేసుకోవచ్చు.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

**మద్యం మానేస్తే కాలేయానికి మేలు**



ఆల్కహాలు శరీరాన్ని విపరీతంగా డీహైడ్రేట్ చేస్తుంది. కాలేయం శరీరం నుంచి ఈ విషాన్ని తొలగించేందుకు కష్టపడుతుంది. ఆల్కహాలుకు బానిసైన వారు భవిష్యత్‌లో సిర్రోసిస్ సమస్యకు గురవుతారు. అలాగే హెపటైటిస్–బి, సి వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్స్ కూడా ఈ కాలేయ సమస్యకు కారణం. 10 నుంచి 15 సంవత్సరాలకు పైగా ఈ ఇన్‌ఫెక్షన్స్‌తో సతమతమయ్యే వారిలో సిర్రోసిస్ సమస్య కనిపించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి జీవనశైలి, సరైన నిద్ర, మద్యపానం, దూమపానికి దూరంగా ఉండటం ద్వారా కాలేయాన్ని కాపాడుకోవచ్చు.

–డాక్టర్ పి.అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

### 23న గురుకుల ప్రవేశ పరీక్ష

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ తెలిపారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని ఆమె వెల్లడించారు. 5వ తరగతిలో చేరే విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందగోరే విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్‌పెన్ మాత్రమే ఉపయోగించాలన్నారు.

### ‘గ్రామాభివృద్ధికి ఈఓపీఆర్డీ సహకరించడం లేదు’

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామపంచాయతీ అభివృద్ధికి ఈఓపీఆర్డీ మణిమంజరి ఏమాత్రం సహకరించడం లేదని ఆ గ్రామ సర్పంచ్ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు గదిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన వనరులు సమకూర్చుకోవాలని అధికారులు చెప్పిన మాటమేరకు తాము గ్రామంలో బండిమెట్ట వసూళ్ల ఏర్పాటుకు 2022 సెప్టెంబర్‌లో పంచాయతీ తీర్మానం చేసి కార్యదర్శి ద్వారా ఈఓపీఆర్డీకి అందజేసినట్లు తెలిపారు. ఆమె ఇప్పటిదాకా బండిమెట్ట వసూళ్లను అమలుచేయకపోవటంతో పంచాయతీ ఆదాయానికి గండిపడుతోందన్నారు. అలాగే గ్రామపంచాయతీ పరిధిలోని కుంటలు, ప్రభుత్వ భూముల్లో పంచాయతీ అనుమతుల్లేకుండా మట్టితవ్వకాలు చేయరాదని తీర్మానం చేసినా దాన్ని కూడా ఈఓపీఆర్డీ అమలుచేయటం లేదన్నారు.

# అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మిడుతూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మిడుతూరు గ్రామ సచివాలయం -2 పరిధిలోని పీరుసాహెబ్ పేట, మిడుతూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పీరుసాహెబ్ పేట గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే జాతిపిత మహాత్మా గాంధీజీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి సంక్షేమ లబ్ధిని వివరించారు. జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో మమేకమై ప్రజామద్దత్తు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు తెలుసుకొని నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తమకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని లబ్ధిదారులు తెలిపారు.

**సమస్యల పరిష్కారానికి ఆదేశం**

మిడుతూరు ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. పీరుసాహెబ్ పేట గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి వేస్టు వాటర్ వలన ప్రతి ఏటా రెండు ఎకరాల పంట నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, చౌట్కూరు సర్పంచ్ మదార్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, కిసాన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సల్కోటీ గోవర్ధన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, సీతారాముడు, రమేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, స్వాములు, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఎకరా కూడా ఎండిపోకూడదన్నదే లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా ముందు చూపుతోనే వారబంది ప్రకారం నీటి విడుదల
- రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 20వ తేదీ వరకు ఆయకట్టుకు నీరు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి

వెలుగోడు: వీబీఆర్ పరిధిలోని మద్రాస్ కాల్వ కింద ఒక్క ఎకరాం పొలం కూడా ఎండిపోకూడదన్నదే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి తెలిపారు. ఆయకట్టు రైతులందరికీ నీరు ఇవ్వాలనే ముందుచూపుతో వారబంది ప్రకారం వీబీఆర్ నుంచి నీటిని పొదుపుగా విడుదల చేయించి పంట పొలాలను కాపాడారని తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సర్పంచ్ జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ తదితరులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాస్తవానికి ఏప్రిల్ 15 వరకు మాత్రమే నీరు ఇచ్చేందుకు తెలుగు గంగ అధికారులు అంగీకరించగా, రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అధికారులతో మాట్లాడి ఈ నెల 20వ తేదీ వరకు నీరు ఇప్పిస్తున్నారని చెప్పారు. రబీ పంటలకు మద్రాస్ కాల్వ ద్వారా నీటిని కంటిన్యూగా విడుదల చేయాలని టీడీపీ నాయకులు కోరారని గుర్తు చేశారు. ఇలా నీటిని విడుదల చేస్తే పంట చివరి దశలో నీటి కొరత ఏర్పడుతుందని గ్రహించిన ఎమ్మెల్యే వారబంది ప్రకారం ఒక వారం నీటిని విడదల చేయించి, మరో వారం గేట్లు మూయించి నీటి పొదుపును పాటించేలా అధికారులను ఆదేశించారన్నారు. రైతులకు ఏ కష్టంవచ్చినా వెంట నడిచే శిల్పా చక్రపాణిరెడ్డికి అన్ని వర్గాలు, పార్టీల నాయకులు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు తెలుగు రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముంతల విజయభాస్కర్‌రెడ్డి, కే. రామ్మోహన్ రెడ్డి, అంకన్న, మోతుకూరు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆర్థికాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

పగిడ్యాల: పేద ప్రజల ఆర్థిక పురోగమనం జగనన్న పాలనతోనే సాధ్యమని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం అనే వినూత్న కార్యక్రమం ప్రజల హృదయాలకు చేరువైందన్నారు. మంగళవారం మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం, రైతుపల్లె తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పల్లె అరుణమ్మ, బోరెల్లి శ్యామలమ్మ, ఎంపీటీసీలు కళావతి, ప్రియాంక, చంద్రమోహన్‌నాయుడు, పగడం గోపాల్, మిద్దె స్వాములు, సర్పంచ్‌లు పెద్ద ఆంజనేయులు, కాటం రాధమ్మ, పెరుమాళ్ల శేషన్న, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

కొత్తపల్లి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ ఎల్లయ్య, చింతమాను శ్రీనివాసులు, పాలెం లింగారెడ్డి, నాగేశ్వర గౌడ్ పాల్గొన్నారు

**సంక్షేమ పథకాలే పేదలకు అండ**

నందికొట్కూరు: పేద ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అండగా నిలిచాయని వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని సంగయ్యపేటలోని 28వ వార్డులో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, బొట్టు రవి, శివనాగయ్య పాల్గొన్నారు.

### వైభవంగా మల్లాలమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం



నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని చిన్నచెరువు కట్ట వద్ద వెలసిన శ్రీ మల్లాలమ్మ దేవస్థానం పంచమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, ఆకుపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి మహా మంగళ హారతులు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాడుగుల నాగేంద్ర శర్మ, దేవస్థానం నిర్వాహకులు పాల్గొన్నారు.

# మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

జూపాడుబంగ్లా: కేంద్రంలో ప్రదాన మంత్రి నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పడాలి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తర్తూరు, మండ్లెం, తంగడంచ, తాటిపాడు, పారుమంచాల తదితర గ్రామాల్లో సీపీఎం జీపుజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కరరెడ్డి, కర్ణ, వెంకటేశ్వర్లు, పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీని గద్దె దించాలి**

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజశేఖర్, సీపీఐ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద వామపక్ష పార్టీలతో ప్రచారయాత్ర నిర్వహించారు. ప్రజా ఉద్యమాలను అనచి వేస్తున్న బీజేపీ ని ఓడించేందుకు అందరు ఏకం కావాలన్నారు. ప్రచారయాత్ర గరీబ్‌నగర్, ఇందిరానగర్, సాయిబాబనగర్, ఏకలవ్య నగర్, అక్కిరాజు కాలనీ వరకు సాగింది. కార్యక్రమంలో నాయకులు రణధీర్, రజాక్, సురేంద్ర, స్వాములు, రామ్‌నాయక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బడీరాత్


నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో వెలిసిన మిఠాయిల దుకాణాలు

జూపాడుబంగ్లా/పాములపాడు: రంజాన్ మాసంలో వచ్చే బడీరాత్‌ను మంగళవారం రాత్రి ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి, రాత్రి మేలుకొని అల్లాహ్‌ను ప్రార్థించడం వల్ల వెయ్యి నెలల పాటు అల్లాను స్మరించినంత పుణ్యఫలం లభిస్తుందని ముస్లిం మతపెద్దలు పేర్కొంటున్నారు. అందుకోసమే బడేరాత్ దినాన ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండి అల్లాను స్మరించుకుంటారని తెలిపారు. ఈ దినాన్ని లైలతుల్ అనికూడా అంటారని, ఈ రాత్రికి ఎంతో విశిష్టత ఉందంటున్నారు. ఈ దినాన దేవదూతలు భువిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించేవారికి శుభాభినందనలు తెలుపుతారని వెల్లడించారు.

**స్పెషల్ మిఠాయిలు**

నందికొట్కూరు: పెద్దరాత్రి సందర్భంగా తినుబండారాల దుకాణాలు మంగళవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో వెలిశాయి. జిలేబి, ఖాజా, లడ్డూ, మైసూర్ పాక్, బాదుషాలను చక్కెర, బెల్లంతో తయారు చేసి విక్రయిస్తున్నారు. ముస్లిం సోదరులు దుకాణాల వద్దకు చేరుకున్ని జిలేబి, ఖాజా, లడ్డు, మైసూర్ పాక్ ఏ రకం తీసుకున్న కిలో రూ. 160లు చొప్పున విక్రయిస్తున్నారు.

### పీఎం శ్రీ పథకానికి మోడల్ స్కూల్ ఎంపిక


మహానంది: పీఎం స్కూల్స్ రైజింగ్ ఫర్ ఇండియా (పీఎంఎస్‌హెచ్ఆర్ఐ) పథకంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో తిమ్మాపురం మోడల్ స్కూల్‌కు చోటు దక్కినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మండలానికి ఒక పాఠశాల చొప్పున 56 పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. అందులో భాగంగా తిమ్మాపురం మోడల్ స్కూల్ ఉందన్నారు. ఈ పథకం ద్వారా కొత్త జాతీయ విద్యా విధానం అమలుతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సామగ్రి, బోర్డులు, తరగతి గదుల్లో ఆన్‌లైన్ వ్యవస్థ లాంటి సౌకర్యాలు కలుగుతాయని చెప్పారు.

# గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోండి


మండ్లెం డంప్‌యార్డులో వర్మికంపోస్టు తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, కార్యదర్శి

జూపాడుబంగ్లా: గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అమలుచేయటం ద్వారా వనరులు సమకూర్చుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. మంగళవారం వారు తర్తూరు, మండ్లెం గ్రామాల్లోని డంప్‌యార్డులను పరిశీలించి వాటిల్లో తయారు చేస్తున్న వర్మికంపోస్టును పరిశీలించారు. ఇప్పటిదాకా ఎన్ని కిలోలు తయారుచేసి ఎంతమేర విక్రయించారు. ఎన్ని నిధులు సమకూరాయి అనే వివరాలను తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో సేకరించిన చెత్తాచెదారంతో వర్మికంపోస్టు తయారుచేసుకోవాలన్నారు. పారుమంచాల గ్రామంలో వచ్చిన స్పందన ఫిర్యాదులపై సర్పంచ్ ప్రకాశంతో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శరత్ పాల్గొన్నారు.

# ఇంటింటికీ వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ

ఆత్మకూరు: వైద్యశాలల్లో పనిచేసే వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ, వ్యక్తికి వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలోని జగద్గురు మఠంలో ఆత్మకూరు డివిజన్‌పరిధిలోని పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలేజ్‌హెల్త్ సెక్రటరీలు, ఏఎన్‌ఎమ్‌లు, వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గర్భిణులు, పుట్టిన బిడ్డలకు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని చెప్పారు. ఇంటింటిలో ఏ రోగాలు ఉన్నాయి, వారికి ఎలాంటి మందులు ఇస్తున్నారు, వైద్య పరీక్షలు ఎలా చేస్తున్నారు తదితర విషయాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రభలినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ సునిత, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎమ్‌హెచ్ఓ కాంతారావు, డీఐఓ ప్రభావతి, డీటీసీడీ అధికారి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న మొబైల్ ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకొని ఆధార్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. మంగళవారం ఆమె పారుమంచాల గ్రామంలో ఏర్పాటుచేసిన మొబైల్ ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈనెల 19న తరిగోపుల, పి.లింగాపురం, 20న 80బన్నూరు, పోతులపాడు, 26న తాటిపాడు, భాస్కరాపురం, 27న తంగడంచ, తర్తూరు గ్రామసచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

కొత్తపల్లి:గ్రామీణప్రాంత ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండలంలోని కొక్కెరంచ, గోకవరం సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. 19వ తేదీన ఎదురుపాడు, శివపురం గ్రామాల సచివాయాల్లో ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**సచివాలయాల్లో ఆధార్ సేవలు**

శ్రీశైలం: శ్రీశైలం మండలంలోని సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ రాజేంద్రసింగ్ మంగళవారం తెలిపారు. గత 10 సంవత్సరాల్లో ఒకసారి కూడా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోని వారు గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ నెల 18, 19, 20, 25, 26 తేదీల్లో ఆధార్‌క్యాంప్‌లు ఉంటాయని అన్నారు.